


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ప్రియరాగాలు

**"ప్రియే! చారుశీలే!"** పిలుస్తూ వంటింట్లోకి వెళ్ళాడు హరీష్.

"నాదగ్గర పదిపైసలు కూడా లేవు" చపాతీలు చేస్తున్న సుప్రియ అదే స్వరంతో చెప్పింది.

"నేను చిన్నబుచ్చుకున్నాను" హరీష్ అలిగాడు.

"అది చూసి గ్రహించాలి. చెప్పకూడదు. ఎందుకటా?" సుప్రియ వచ్చే నవ్వుని ఆపుకుంటూ అడిగింది.

"చూసి గ్రహించడానికి నువ్వు నా మొహం చూస్తేగా? పికాసో పెయింటింగ్ వేస్తున్నంత శ్రద్ధగా చపాతీలు చేస్తున్నావు. నువ్వీ మధ్య నన్ను మరీ కించపరుస్తున్నావు" ఆరోపణగా చెప్పాడు.

"ఇంతకీ విషయం ఏమిటి?"

"ఆ నిర్లక్ష్యమే వద్దు. అంత ప్రేమగా పిలిస్తే నీ పదిపైసలకోసం అనుకుంటున్నావు. రేపు నా పుట్టినరోజు కదా? పాయసంలో కాసిని ఎక్కువ జీడిపప్పువేసి, చివర్లో కొద్దిగా మిల్క్‌మెయిడ్ కూడా వేస్తావా అని అడగడానికి వచ్చాను" హరీష్ స్టవ్ మీది కూరలోని బంగాళాదుంప ముక్కల్ని ఫోర్క్‌తో అందుకుని ఊదుకుని తింటూ చెప్పాడు.

సుప్రియ చేసేపని వదిలేసి అతన్ని ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ చెప్పింది.

"సారీ హరీ. లాస్ట్ మంత్ నా దగ్గర వెయ్యిరూపాయలు తీసుకున్నావుకదా? మళ్ళీ డబ్బుకోసమే కిచెన్‌లోకి వచ్చావేమోనని..."

"ఒక్కసారి అప్పు తీసుకున్నందుకు ఇంత అపార్థం చేసుకుంటావా ప్రియే! కఠిన కఠిన హృదయే?" హరీష్ ఆమె భుజం మీద తలానించి ఆరోపణగా చెప్పాడు.

"ఇంతకీ రేపు నీ బర్త్‌డే సండే రోజు వచ్చింది. ఏం చేద్దాం?" సుప్రియ అతన్ని వదిలి చపాతీలు కాలుస్తూ అడిగింది.

"పాయసం..."

"అది సరే. ఇంకా.."

"ఇంకా? మరి నా మాట వింటావా?" ఆశగా అడిగాడు.

"అలాగే రేపంతా నువ్వు చెప్పినట్లే వింటాను."

హరీష్ మొహం ఆనందంతో విప్పారింది.

"ఐతే రేపు సాయంత్రం ఏటి ఒడ్డుకి వెళ్దామా?" అడిగాడు.

ఆ మాట వినగానే సుప్రియ అట్లకాడతో చపాతీని వెనక్కి తిప్పింది.

"నువ్వు సరేనన్నావు పంతువరాళీ" హరీష్ బెదిరింపుగా చెప్పాడు.

"వెళ్ళి టి.వి పెట్టి డైనింగ్ టేబుల్ సర్దెయ్. వస్తున్నా" ముభావంగా చెప్పింది.

హరీష్ ఆనందంగా ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి వెన్నెల వెలుగులో మెరుస్తున్న సుప్రియ చెంపమీద వేలితో రాస్తూ హరీష్ అడిగాడు.

"ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నావు వసంతయామినీ? ఏటి ఒడ్డుకి వెళ్దామన్నాననా?"

"అవును. ఈ ఊరు వచ్చినప్పటినించీ నీ పద్ధతి నాకు నచ్చలేదు హరీ" కఠినంగా చెప్పింది.

హరీష్ మాట్లాడలేదు.

"పేకాడుతున్నావా?"

"నేనా? ఛ!" హరీష్ ఉలిక్కిపడ్డాడు.

"మరి బెట్టింగ్?"

"ఛీఛీ."

"నిన్నెవరైన బ్లాక్ మెయిల్ చేస్తున్నారా?"

"నన్నా? ఎందుకు?" ఎదురు ప్రశ్న వేసాడు.

"కొత్త ప్రేయసి దొరికిందా?"

"రామ! రామ!" చెవులు మూసుకున్నాడు.

"మరి నన్నెందుకు అప్పు అడుగుతున్నావు? ఇదివరకు ఎప్పుడైనా ఇలా చేసావా?"

హరీష్ మాట్లాడలేదు.

"ఆదివారం వస్తే చాలు ఆ ఏట్లోకి ఎందుకు తీసుకెళ్తున్నావ్? 'కావాలంటే నువ్వెళ్ళు' అంటే వెళ్ళవు. వెంట నేనుండాలి. వెళ్ళినా ఏం మాట్లాడవు. బొమ్మలా గంటసేపు కూర్చుంటావ్.." సుప్రియ ఆవేశంగా అడుగుతుంటే హరీష్ బతిమాలుతూ చెప్పాడు.

"ప్రియే కలహాంతరితే! ప్లీజ్."

అతని మొహం చూసిన సుప్రియ మరేం మాట్లాడకుండా అటువైపు తిరిగి పడుకుంది.

సుప్రియకి పెళ్ళి సంబంధాలు చూసేప్పుడు ఒకరోజు వాళ్ళ మామయ్య చెప్పాడు "ఫస్ట్‌క్లాస్ సంబంధం చూసాను. ఆ అబ్బాయికి వంక పెడదామన్నా లేదు. ఈ సంబంధం కుదిరితే నీ అంత అదృష్టవంతురాలు లేదనుకో"

"ఏం చేస్తాడు మామయ్యా?" సుప్రియ ఆసక్తిగా అడిగింది.

"కలెక్టర్ ఆఫీస్‌లో పనిచేస్తాడు. గవర్నమెంట్ ఎంప్లాయీ"

"క్లర్కా?" సుప్రియ నీరసంగా అడిగింది.

"క్లర్కా ఏమిటి నీ మొహం? రెవెన్యూలో జాబ్ అంటే ఏమనుకున్నావ్?" ఆయన కసిరాడు.

"సాఫ్ట్‌వేర్ అబ్బాయిని చూడు మామయ్యా. అమెరికా అంటే ఇష్టం నాకు."

"వాళ్ళు మనకి అందుతారటే తల్లీ. హరీష్‌ని చూసాక చెప్పునాకు. మన్మధుడిలా ఉంటాడు" ఆయన సర్ది చెప్పాడు.

"మంకీలా ఉన్నా పర్లేదు మామయ్యా. సాఫ్ట్‌వేర్..." ఆయన కళ్ళల్లోని కోపాన్ని గమనించి మాట్లాడడం ఆపేసింది.

పెళ్ళి చూపుల్లో హరీష్ నోరు తెరుచుకుని ఆమెవంకే చూస్తూండిపోయాడు. అరనిమిషం తర్వాత తెప్పరిల్లి చెప్పాడు.

"ఎంత బావున్నారండీ చారువదనా."

మొహం చిట్లించింది.

"చారువదన అంటే అందమైన మొహం కలదానా అని" సుప్రియ అన్నయ్య చెప్పి గట్టిగా నవ్వాడు.

"సారీ. సంస్కృతం అంటే నాకు చాలా ఇష్టం. అందుకని అప్రయత్నంగా అలా మాట్లాడేస్తూ ఉంటా" హరీష్ ఇబ్బందిగా చెప్పాడు.

"ఏం పర్లేదు. మీరు కూడా హరీష్ కాదు రతీష్‌లా ఉన్నారు" సుప్రియ అన్నయ్య మెచ్చుకున్నాడు.

సాఫ్ట్‌వేర్ కాదనే అసంతృప్తిగా ఉన్నా హరీష్‌లోని అమాయకత్వం నచ్చిన సుప్రియ పెళ్ళికి ఒప్పుకుంది.

'ప్రియే చారుశీలే ', 'ప్రియే ఇందువదనే ' అని పిలుస్తూ హరీష్ ఇంట్లో ఉన్నంతసేపూ ఆమె చుట్టూ ఉపగ్రహంలా తిరుగుతూంటాడు.

ట్రాన్స్‌ఫరై చిత్తూరు కలెక్టరేట్‌కి వచ్చాక హరీష్‌లో అంతదాకా తనకి తెలియని మార్పుని సుప్రియ గమనించింది. ఎందుకో బాధపడుతున్నట్లుగా ఉన్నాడు. తరచూ అక్కడికి నూటఏభై కిలోమీటర్ల దూరంలోని పల్లెటూరి శివార్లలో ఉన్న ప్రశాంతంగా పారే ఒక చిన్న కొలను దగ్గరకి తీసుకెళ్తున్నాడు. బయటకి వెళ్తే డబ్బవసరంలేని హరీష్ అప్పుడప్పుడూ భార్య దగ్గర డబ్బు తీసుకుంటున్నాడు.

"నీకు సుప్రియ అని పేరు పెట్టారు కాని 'సుపాయస కరణి' అని పెట్టాల్సింది. ఎంత బాగుందో తియ్యగా" రెండో కప్పుతింటూ హరీష్ తన్మయత్వంగా చెప్పాడు.

"పాయసం తియ్యగా ఉండక కారంగా ఉంటుందా?" సుప్రియ నవ్వింది.

"ప్రియే చారుకేశీ నువ్వు కూడా కొత్త డ్రెస్ వేసుకోవచ్చుగా?" తన షర్ట్‌ని మురిపెంగా చూస్తూ అడిగాడు.

"నువ్వు కొనివ్వలేదుగా? నా దగ్గరున్నవాటిలో కొత్తది వేసుకుంటాలే."

హరీష్ మొహం చిన్నబోయింది.

"నేను చాలా బాధపడుతున్నాను. నువ్వు నా గురించి ఆలోచించినట్లు నేను నీ గురించి ఆలోచించలేదు. నేనంతే స్వార్థపరుడ్ని" అతని కళ్ళలో పల్చటి నీటి తెర.

"ఇంత సెన్సిటివ్ అయితే ఎలా హరీంద్రమధ్యమా?" సుప్రియ ఓదార్చింది.

హరీష్ గలగల నవ్వాడు.

"భలే చెప్పావే, నా నడుం అంత సన్నగా ఉంటుందా? సుమధ్యమా"

"నీ నవ్వుకి కోటిరూపాయలివ్వచ్చు హరీ ఎంత ముద్దుగా ఉంటుందో నీ నవ్వు" చెప్పింది.

"నీ దగ్గర పదిపైసలు కూడా లేవన్నావ్?"

ఈసారి సుప్రియ గలగల నవ్వింది.

సుప్రియ ఒళ్ళోపడుకుని మంద్రంగా పారే ఏటిని చూస్తున్న హరీష్ చెప్పాడు "ఈ ఏటి కడుపులో ఎన్ని రహస్యాలున్నాయో!"

"నీ గురించి నేనూ అదే అనుకుంటున్నాను తెలుసా?" సుప్రియ అతని జుట్టుతో ఆడుకుంటూ చెప్పింది.

"నా కడుపులో రహస్యాలా?" హరీష్ ఆశ్చర్యపోయాడు.

"రాత్రి అటు తిరిగి పడుకున్నానా వెంటనే నిద్రపట్టలేదు తెలుసా?"

"నాక్కూడా" హరీష్ జాలిగా చెప్పాడు.

"అప్పుడు నీ గురించి ఆలోచిస్తే నాకు కొన్ని తట్టాయి."

"తట్టాయా? ఏంటవి?" హరీష్ లేచి కూర్చుని ఆసక్తిగా అడిగాడు.

"నువ్వో నక్సలైట్‌వి."

"ఏమిటీ?" అదిరిపడ్డాడు.

"ఈ చుట్టుపక్కలంతా అడవేకదా? నువ్వు వాళ్ళని కలుసుకోడానికి ఇక్కడికి వస్తున్నావ్" సుప్రియ గంభీరంగా చెప్పింది.

"నిన్నొదిలి నేను అడవిలోకి వెళ్ళానా?"

"ఐతే నువ్వు సానుభూతిపరుడివి. నా దగ్గర తీసుకున్న డబ్బు బైక్‌లో పెడతావు. మనం ఇక్కడ కూర్చుంటే వాళ్ళు రహస్యంగా ఆ డబ్బు తీసుకెళ్ళిపోతారు."

"వెయ్యి రూపాయలకోసం వాళ్ళంత రిస్క్ తీసుకుంటారంటావా?" హరీష్ అనుమానంగా అడిగాడు.

"హుఁ ఐతే నీకో ప్రియురాలుంది. ఇద్దరూ ఇక్కడే కలుసుకునేవారు. ఒన్ ఫైన్‌డే ఆ అమ్మాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని చేసుకుని అమెరికా వెళ్ళిపోయింది. మర్చిపోలేని నువ్వు ఇక్కడికి వచ్చి బాధపడుతున్నావు"

"నా శీలాన్ని శంకిస్తున్నావు ప్రియా. నాకు కోపం వచ్చింది" చిరుకోపంగా చెప్పాడు.

"సంస్కృతం" సుప్రియ గుర్తుచేసింది.

ఆ తర్వాత ముభావంగా ఉన్న హరీష్‌ని చూసి పుట్టినరోజున బాధించానని సుప్రియ బాధపడింది. హరీష్ తరచూ అలుగుతాడు. కాని అది ఐదు నిమిషాలు మాత్రమే. ఆరో నిమిషంలో 'ప్రియే' అంటూ పక్కకి చేరతాడు. అలాంటిది గంటలు గడిచినా ముభావంగా ఉండడంతో సుప్రియ విలవిల్లాడిపోయింది.

"సారీ హరీ. క్షమించెయ్. నువ్వెప్పుడు రమ్మంటే అప్పుడు ఆ లేక్‌కి వస్తాను. అలా మౌనంగా ఉండొద్దు" అని బతిమాలింది.

ఆ రాత్రి భార్య గుండెల్లో తలదాచుకుని హరీష్ దాదాపు అరగంటసేపు ఏడుస్తూనే ఉన్నాడు. తర్వాత వెక్కిళ్ళ మధ్య చెప్పాడు.

"మాది ఆ ఊరే. నందిరాజు తిప్ప. నేనక్కడే పుట్టి పెరిగాను. ఆ పరిసరాల్లోనే తిరిగి ఆడుకున్నాను. నా బెస్ట్ ఫ్రెండ్ మునెప్ప. వాడూ, నేను ఒకచోటే ఉండేవాళ్ళం. చదువు సంధ్య గురించి పెద్దవాళ్ళు పట్టించుకునేవాళ్ళు కారు.

ఓ రోజు మేమిద్దరం ఆ ఏటి ఒడ్డున ఆడుకుంటున్నాం. మాకు అప్పుడు పదేళ్ళుండచ్చు. ఇసకలో ఆల్చిప్పలు, నత్తగుల్లలు ఏరుకుంటున్నాం. అకస్మాత్తుగా ఏదో గొడవ వినిపించి చూసాం. మా ఇళ్ళదగ్గరే ఉండే పదిహేనేళ్ళ బుజ్జమ్మని మా ఊళ్ళోని ఇద్దరు రౌడీలు ఎత్తుకొస్తున్నారు. ఆ అమ్మాయి గింజుకుంటూ ఏడుస్తోంది. ఏదో అఘాయిత్యం జరగబోతోందని మా పసిహృదయాలకి అర్థమై వాళ్ళ దగ్గరకి వెళ్ళి మా గుప్పెళ్ళతో వాళ్ళని కొడుతూ బుజ్జిని దింపమని

గోల చేసాం. వాళ్ళు మమ్మల్ని అవతలకి వెళ్ళమని కసిరారు. ఐనా మేం ఆపలేదు. దాంతో ఒకడికి కోపంవచ్చి" హరీష్ గద్గదంగా ఆగిపోయాడు.

సుప్రియ ఓదార్పుగా అతని వీపు నిమిరింది.

"ఒకడికి కోపం వచ్చి మునిని ఎత్తి ఏట్లోకి విసిరేసాడు. ఆగస్ట్ నెల. ఉధృతంగా పారుతూన్న ఏట్లో వాడు 'రాంపండూ' అని అరుస్తూ కొట్టుకుపోయాడు. నన్ను రాంపండు అనేవాళ్ళులే. ఆ రౌడీ నా వైపు కూడా వస్తూంటే నేను భయంతో పారిపోయాను. ఇంటికి వెళ్ళి భయంతో మా నాయనమ్మ పక్కన పడుకుని ఆవిడని హత్తుకుని ఏడవసాగాను.

ఏమైందా అని ఇంట్లోవాళ్ళు కంగారుపడి నా చుట్టూ చేరి ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంతలో మునిని వెతుక్కుంటూ వాడి పేరెంట్స్ వచ్చారు. ఏడుస్తూ వాళ్ళకి జరిగింది చెప్పాను. బుజ్జి కనిపించడంలేదని వాళ్ళ వాళ్ళింకా గమనించలేదు. చిన్న ఊరుకదా ఊళ్ళో వాళ్ళంతా అడవికి బయలుదేరారు. బుజ్జి శవం దగ్గర్లోనే పడివుంది. మర్నాడు ఐదుమైళ్ళ దూరంలో సిమెంట్ గొట్టాల దగ్గర చిక్కుకున్న ముని శవం కనిపించింది. రౌడీలు ఊరు వదిలి పారిపోయారు.

అక్కడుంటే నేను కోలుకోవడం కష్టం అని మా కుటుంబం మా అమ్మమ్మ వాళ్ళ ఊరికి వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంది. పైగా పోలీసులకి నేను ఆ రౌడీల పేర్లు చెప్పాను. దాంతో నా ప్రాణాలకి ప్రమాదమని భయపడ్డారు. ఆ తర్వాత నేను పిరికివాడినైపోయాను ప్రియా. హాస్యం చాటున పిరికితనాన్ని దాచుకున్నాను. ఇక్కడికి ట్రాన్స్‌ఫరయ్యాక ధైర్యం చేసి ముని ఇంటికి వెళ్ళాను. వాళ్ళు అకాల వృద్ధులయ్యారు. రాంపండునని చెపితే, ముని అప్పుడే పోయినట్లు ఏడ్చారు. నన్ను వాళ్ళ కొడుకనే అనుకోమన్నాను. చిన్న చిన్న ఆర్థిక సహాయాలు చేస్తున్నాను. అందుకే నీ దగ్గర తీసుకోవడం..."

"నాకేమైనా ఇన్‌కం ఉందా హరీ. నీ డబ్బేగా? ఏదో సరదాకి ఏడ్పించాను. నీకు ఏవైనా వ్యసనాలు అలవాటవుతున్నాయేమో అని భయపడ్డాను. అంతే" సుప్రియ ఓదార్పుగా చెప్పింది.

"ముని ఆత్మ ఆ ఏట్లోనే ఉందేమో! వాడు నన్ను చూసి ఆనందిస్తాడేమో అనే ఊహతో అక్కడికి వెళ్తున్నాను. కాని పిరికివాడిని కదా? వంటరిగా వెళ్ళలేను. అందుకని నీకు ఇష్టంలేదని తెలిసినా నావెంట తీసుకెళ్తున్నాను. వాడు ఏట్లో పడేప్పుడు 'అమ్మా' అనో 'నాన్నా' అనో అరవలేదు. 'రాంపండూ' అని అరిచాడు..." దుఃఖపు తెర అడ్డుపడడంతో హరీష్ ఆగిపోయాడు.

"ఊరుకో హరీ. నువ్వు చెప్పిన వాస్తవంకంటే నా ఊహలే బాగున్నాయి. ఇకనించి ప్రతీ ఆదివారం మనం ముని పేరెంట్స్‌ని, తర్వాత మునిని కలుద్దాం" సుప్రియ అతని కళ్ళు తుడుస్తూ చెప్పింది.

"నాకు చాలా ఆనందంగా ఉంది" హరీష్ చెప్పాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments